

# రూళ్ళ కర్రలు

## నాయని కృష్ణకుమారి

అది నగరంలో పేరు మోసిన ఆస్పత్రిలో ఏ. యం. సి. వార్డు. అక్కడ మృత్యువుతో హోరా హోరీ పోట్లాట సాగిస్తూ పదహారు మంది రోగులు మంచాలు పట్టి ఉన్నారు. మృత్యు పరిష్వంగం తాలూకు అతి శీతల స్పర్శ ఆ ప్రదేశమంతా అలుముకు పోయినట్లు నరనరాల్లో జలదరింపు కలుగుతోంది. ఎదుట పెట్టిన రకరకాల తినుబండారాల్లో నుంచీ యిష్టమైన దాన్ని అతి నాజూగ్గా కొన వేళ్ళతో అందుకుని, ముని పళ్ళతో సుతారంగా కరిచి కొరుక్కు తింటున్నట్లు, మృత్యువు అక్కడి మనుషులందరిలో జంకునూ విస్మయాన్నీ కలిగిస్తోంది.

యాక్యూట్ మెడికల్ కేర్ వార్డంటే చావబోయే రోగుల ప్రాణాల్ని శ్రద్ధగా కాపాడి సాధ్యమైతే యీ లోకానికి తిరిగి యీడ్చుకొచ్చి పడేసే వార్డు. ఆస్పత్రి రూల్స్ ప్రకారం ఆ వార్డు ఎర్‌కండిషన్ చేసి వుండాలి. అందులోకి ఆస్పత్రి సిబ్బంది తప్ప మరెవరూ పోకూడదు. రోగుల్ని కంటికి రెప్పలా కాచుకోవలసింది డాక్టర్లూ, నర్సులే గాని, రోగుల తాలూకు చుట్టాలు కాదు. నెయ్యి పోస్తే ఎత్తుకునేంత నున్నగా, నీడ చూచుకునే లాగ, శుభ్రంగా వుండాలి వార్డు. ఆపరేషన్ థియేటర్‌లోకి పోవడానికి ఎన్ని కట్టుదిట్టాలో, ఏ. యం. సి. వార్డులోనూ అన్నీ వుండాలి. ఇవన్నీ ఆ వార్డుకు సంబంధించిన రూళ్ళు! ఆ రూళ్ళే కర్రలై మనుషుల్ని ఎట్లా బాధిస్తాయంటే .... ...

రాత్రి ఎనిమిది గంటల సమయం మూడో విడత మనుషులు వచ్చే వేళ. టక టకా చెప్పులు చప్పుడు చేసుకుంటూ ఓ హౌస్ సర్జన్ లోపలికి వచ్చాడు.

అతగాడు నల్లగా చెయ్యెత్తు మనిషి, మొహం మోటుగా, జుట్టు ఉంగరాలు తిరిగి దిట్టంగా ఉన్నాడు. ఎంతో డబ్బు పోసి మరీ ఈడిగ్రీ తెచ్చుకుంటున్నానుసుమా అనే అహంకారం మొహమెల్లా నింపుకుంటున్నట్లు కనిపిస్తున్నాడు. కనుబొమలు దట్టంగా ముక్కు పడి మొహం మీద ఏమాత్రం మార్గం కనిపించకుండా, జాగ్రత్త పడుతున్నట్లున్నాయి. తెల్లటి డాక్టరు కోటులో అతని నల్లదనం మరీ విజృంభిస్తోంది. పైన శరీరానికి సంబంధించిందే అయినా ఆ రంగు చర్మాన్ని దాటి, రక్తంలో కరిగి, గుండెనిండా పేరుకున్నట్లుంది.

ఆ వార్డులో ఓ మంచం మీద పదిహేనేళ్ళ పసి ప్రాయపు తల్లి పడి ఉంది. ఇంకా కుదుళ్ళలోంచి జడ బిగుతుగా వేసుకుని, పిక్కలు కనబడేట్లు పరికిణీకట్టుకుని తొక్కుడు బిళ్లాడు కోవలసిన వయసు. ఈ దౌర్భాగ్యపు దేశంలో అప్పుడే ఆ పిల్ల బిడ్డను పోగొట్టుకున్న అమ్మాయి, ఆస్పత్రి పాలై పోయింది. మంచం మీద ఆవిడ పిట్టంత దేహం నిలవకుండా ఎగిరెగిరి పడుతూ చూచేవాళ్ళకు భయం కలిగిస్తున్నది. ముక్కులోంచి ఆక్సిజను గొట్టం జారిపోతే పక్కన కూచున్న మొగుడు ఏం చెయ్యాలో తెలీక తికమక పడుతున్నాడు. రోగి కంటి పాపలు చివళ్ళకు చేరుకుని, పక్కనుంచి చూ చేవాళ్ళను బిల్లంగి పెద్ద చూపుల్లాగ అదర గొడుతున్నాయి.

నల్ల హౌస్ సర్జన్ చకచకా వార్డంతా తిరుగు తున్నాడు. పిల్ల తల్లి ముక్కులోంచి జారిపోయిన ఆక్సిజన్ గొట్టాన్ని పట్టించుకోలేదు. ఎదురుగా ఉన్న నడుం విరిగిన రోగి సెలైన్ డ్రిప్‌లో చుక్కలు పడడం లేదనీ గమనించలెడు. పిల్ల తల్లి మంచానికి పక్క మంచం మీద స్పృహ లేకుండా ఒక ముసలామె ఉంది. ఆవిడ దగ్గర కూతుళ్ళిద్దరు ఆవిణ్ణి చూచుకోడాని కని ఉన్నారు. ఇద్దరూ ఆరాత్రి తోడుగా ఆ వార్డులో అమ్మదగ్గర ఉందామని వచ్చారు.

నల్ల హౌస్‌సర్జన్ వాళ్ళ దగ్గరికి వచ్చాడు. "రోగిదగ్గరఒక్కరేఉండాలి. నాకు రూలంటే రూలే. ఒకరు బయటికి వెళ్ళిపొండి" గట్టిగా అరిచాడు. ఆ అరుపు ధాటికి ఒక మంచం పక్కనుంచి మరో మంచం వైపుకు పోతున్న నల్లపిల్లి తోకముడిచి పరుగు పుచ్చుకుంది.


అరుస్తున్నప్పుడు మరీ అనాగరకంగా నల్లగా మారిన డాక్టరు ముఖాన్ని వింతగా చూచింది పెద్దావిడ. పాపం ఏదో ఇబ్బంది మాట్లాడుతున్నాడు వార్డు డాక్టరు.

పిల్లతల్లి మంచంకింద గోనెసంచిలో అల్యూమినియం గిన్నెలు తొంగి చూస్తున్నయ్.

ఒక గిన్నెలో అత్తెసరేసుకున్న అన్నం గట్టిగా రాయిలాగా గిన్నెను అంటి పట్టుకుని మట్టవంగా కనిపిస్తోంది. దానిమీదో గోనె గుడ్డ, చాలీచాలనట్లుగా కప్పబడి ఉంది. పెళ్ళాన్ని ఆస్పత్రికి తెచ్చేటప్పుడు కూడొండుకుని, గిన్నె, దొన్నె గోనెలో సర్దుకుని, మరీ వచ్చేశాడు మొగుడు.

ఆస్పత్రి రూల్సులో గోనెసంచులు మంచాల కింద పెట్టుకోకూడదని లేదు కాబోలు. అట్లాగే రొట్టె ముక్కలు పెట్టుకునే అల్మారాల దగ్గర పిల్లులు తచ్చాడ కూడదనీ లేదు. ఎలుకలు ఒక మూల నుండి మరోమూలకు పరుగెత్తే హౌస్‌సర్జన్ల లాగా వరుస్తూ, మనసైనప్పుడు ఎవరి మీద పడే వాళ్ళమీదకి ఎగరకూడదనీలేదు. కేవలం ఒక్కరోగి దగ్గర ఇద్దరుండకూడదని మాత్రమే ఉంది. అయినా ఈ రూళ్ళన్నీ కర్రలై మనుషుల్ని దండించాలి గానీ, అల్పజీవులు పిల్లుల మీదికీ, బొద్దింకల మీదికీ పోవడం ఎంత పాపవు తక్కువ! పెద్దావిడ బయటికి పోయి విజిటర్స్ షెడ్‌లో ఓ బెంచీమీద కూలబడదామనే అనుకుంది. కానీ అరవడం అయిపోయింతర్వాత ఆ విషయం పట్టించుకోకుండా వెనక్కు తిరిగి హెడ్ నర్సువుండే మందులబల్ల దగ్గరకొచ్చాడు నల్ల హౌస్ సర్జన్. హెడ్ నర్సుకు యాభై దాటి అయిదారేళ్ళయి వుండవచ్చు. మొహంలో సాధుత్వం అలంకారం లాగా పరుచుకు పోయి వుంది. గట్టిగా మాట్లాడడం గానీ, అనవసరంగా మాట్లాడడం గానీ ఇష్టమైన మనిషిలా కనిపించదు - ఆవిడ ఆ బల్ల దగ్గర ఒక కుర్చీలో కూచుని వుంది. ఆవిడతో మరో నర్సు ఎవరికీ వినపడనంత చిన్నగా

# దీపావళి కొండొకచో అమావాస్యరా!




ఏదో మాట్లాడుతోంది. ఆ యిద్దరూ కూర్చున్న కుర్చీలు డాక్టర్లు కూచోడానికి మాత్రమే ఆ వార్డులో వేసిన కుర్చీలు.

నర్సులు వార్డులో డ్యూటీలో వున్నప్పుడు నిలువు కాళ్ళ మీద వుండాలే గాని కుర్చీల్లో కూచోకూడదు. ఇది కూడా ఆస్పత్రి రూల్సులో ఒకటి. ఇదుగో యిక్కడ మొదలైందండీ యుద్ధం!

"యూ గెటప్" - తన కరుకు గొంతుతో ధాష్టీకంగా అరిచాడు నల్లహౌస్ సర్జన్. ఇద్దరు నర్సులకూ, క్షణంలో సగం సేపు అతనంటున్న దెవరినో అర్థం కాలేదు. అయినా హెడ్‌నర్సు అవితర్కితంలా లేచి నిలబడింది. రెండో ఆవిడ కూర్చునే ఆ నల్ల మొహంలోకి అయోమయంగా చూస్తూ వుండిపోయింది.

రెండో నర్సు నిజానికి ఆ వార్డుకు చెందిన మనిషి కాదు. వేరే వార్డులో రెండో షిఫ్టు పూర్తయ్యాక ఇంటికి పోతూ పోతూ హెడ్ నర్సును పలకరించి పోదామని వచ్చింది.

ఆ నర్సు సన్నగా, పొడుగ్గా వుంది. లేత చామనచాయ రంగులో అచ్చమైన తెలుగు పిల్లలా మెరుస్తో తొడుక్కున్న దుస్తులు తెల్లగా మెరుస్తూంది. ఆవిడకు ప్రతి పనిలో వుండే కల్తీలేని స్వచ్ఛతను చాటుతున్నయి. తలకట్టూ విప్పుకున్న గుడ్డ కిరీటం గంజి పెళపెళలతో నేనెప్పుడూ అలసిపోను సుమా అన్నంత నిటారుగా వుంది. ఆ నర్సు ముఖంలో అలసట వుంది గాని విసుగులేదు. చిరునవ్వు పల్చని పెంటు పూతలాగా కనీ కనిపించకుండా ఘుమఘుమలాడుతూ ఆ ముఖాన్ని అంటి పెట్టుకుని వుంది. ఆవిణ్ణి చూచిన ఎవరైనా, సమర్థురాలు సుమా అనే అభిప్రాయాన్ని కలిగి వుంటారు.

"నీకే చెప్పేది! ఈ వార్డులో నీకేం పని? వార్డులో మాట్లాడడం రూల్సుకు విరుద్ధం. ముందు బయటికి నడు".

రెండో నర్సు లేచి నిలబడ్డది.

"వార్డులో కుర్చీల్లో నర్సులు కూచోకూడదని తెలీదా! - ఎన్నేళ్ళ సర్వీసు నీది?"

పక్కన రోగికి జ్వరం కొలుస్తున్న జైనీ నర్సాక పిల్ల, హెడ్ నర్సు మొహంచూసి, గబగబా వచ్చి వాళ్ళిదివరకు కూర్చున్న రెండుకుర్చీలూ యధా స్థానంలో సర్దేసింది. ఏరోగికో బెడ్ పాన్ పెట్టడాని కొచ్చిన వార్డు బాయి విస్తుపోయి చూస్తూ నిలబడి పోయాడు. హెడ్ నర్సు ఏమీ మాట్లాడక లేదు. రెండో నర్సే అందుకుని, "రూళ్ళు జ్ఞాపకం చేసేశారు కదా చాలు! మరీ అంత గొంతుచించుకుని, అరవడం అవసరమా! ఎ. యం. సి. వార్డు ప్రశాంతంగా వుండా లని మీకు తెలిసినట్లు లేదు. మీరూ రూల్సు మాట్లాడుతున్నారు." చాలానింపాదిగా అనేసి దృఢంగా అనేసింది.



ఆ వార్డు ఏర్‌కండిషన్ చేసింది కాదు. పోయే ప్రాణాలు ఆ మూలా, ఈ మూలా చిక్కుకు పోకుండా రోగుల తల దగ్గర కిటికీలు తెరిచే వుంటాయి. జులై నెల సగం వర్షం చేత బయట ముసురు పట్టి తడి జల్లు కురుస్తోంది. చైతన్యం లేని రోగుల కెట్లా వుందో తెలీదుకాని, రోగుల్ని కనిపెట్టుకున్న వాళ్ళకు మాత్రం చలిగా వుంది.

నల్ల హౌస్ సర్జన్‌కు మాత్రం చెంపల వెంట వేడి పొగలు. లోపల ఓ బొగ్గుల కుంపటి రగిలించినట్లయిపోయి మొహం [illegible] కమిలి పోయింది.

"ఏమిటే! కొవ్వుపొగరెక్కిందా! నువ్వెంత నీ అంతరమెంత? నీ అంతు చూసాన్నేనే మనుకున్నావే?" అంటూ గాండ్రించడం మొదలు పెట్టాడు.

"ఏ!— మాటలు మర్యాదగా రానీ! నా అంతు నువ్వేం చూస్తావ్! రేపీపాటికి మా నర్సెస్ ఎసోసియేషన్ తలుచుకుంటే నిన్నేమైనా చెయ్యగలదు. ముందుగా డాక్టర్లతో పాటు సమానంగా నర్సులు కూడా కూచో వచ్చునని నీ రూళ్ళు మార్పించమంటావా! మర్యాదిచ్చి పుచ్చుకోవడం తెలీని నువ్వేం డాక్టరువు! నీకూ నాకూ మధ్య




అంతరం కావాలా? నువీ డిగ్రీ కోసం చదివిన కాలం, నా సర్వీసులో సగం కూడా కాదు. గుర్తుంచుకో!" అని ఎడాపెడా దులిపేసింది రెండో నర్సు.

"ముందు బయటికి నడు ఈ వార్డు నాది. ఇందులోకి అడ్డమైన వాళ్ళూ రావడం నేను సహించను. ఐ సే గెటౌట్!" మరీ గట్టిగా గొంతులో నరాలు తెగిపోతాయా అన్నంత గట్టిగా అరిచాడు.

"ఎవరా అడ్డమైన వాళ్ళు!– అంటూ ఆ రెండో నర్సు ఘాటుగా నల్ల హౌస్ సర్జన్ అమ్మకు తగినట్టు ఓ ఇంగ్లీషు తిట్టు తిట్టింది.

ఇక రెండు పక్కల మనుషుల్లో ఉండే మనిషి తనం మాయమైపోయి, జంతువులు ప్రవేశించాయి. అనరాని వినరాని తిట్లు అటు తెలుగులోనూ ఇటు ఇంగ్లీషులోనూ విచ్చలవిడిగా దూసుకు రానారంభించాయి. పందులూ, కుక్కలూ వంటి జంతువులకు మాట్లాడ్డం వచ్చినా ఆ విధంగా తిట్టుకోడానికి సిగ్గు పడచ్చు. తిట్టుకుని, తిట్టుకుని ఇద్దరూ అలసిపోయారు. హెడ్ నర్సు గాజుకళ్ళతో

## దీపావళి కొండొకచో అమావాస్యయే!




జరిగేదాంతో నిమిత్తం లేనంత నిర్లిప్తంగా ఎటో చూడసాగింది.

ఉన్నట్టుండి రెండో నర్సు హెడ్ నర్సుతో "చూడండి సిస్టర్! నేనో అరగంటలో తిరిగొస్తాను. మూడుపాళ్లు మనమంతా సత్యాగ్రహానికి సిదంగా ఉండాలి. ఇదెంత వరకు పోతుందో మనమూ చూద్దాం" అంటూ గిరుక్కున వెనక్కు తిరిగి వెళ్ళిపోయింది.

నల్ల హౌస్ సర్జన్ తాపీగా డాక్టర్ల కుర్చీలో కూచుని సిగరెటు ముట్టించి పొగను రింగులు రింగులుగా వదలడం మొదలు పెట్టాడు. అన్నట్టు డ్యూటీమీదున్న డాక్టరు ఎ. యం. సి. వార్డులో పొగ తాగకూడదని రూల్సు స్పష్టంగా చెప్పలేదు కాబోలు! పైన రింగులు తిరిగే పొగ, మనసులో మట్టు ముట్టె ఆలోచనలూ. పిల్లగా, మసగ్గా [illegible] తయపెట్టేస్తున్నాయి. హెడ్ నర్స్ అలాగే నిలబడి ఉంది.

పిల్లతల్లి మంచానికి అవతలివైపు, ఒక గుండెరోగి యముడితో పోట్లాడుతున్నాడు. ఇంచుమించు స్పృహలేని స్థితి. ఇ. సి. జి. చూపించే వంకర టింకర గీతలు మృత్యువు కోరల్లాగా భీకరంగా, వేగంగా కదులుతున్నాయ్. ఎదురొమ్ము ఎగిరెగిరి పడుతూ రోగి పడే యాతనను స్పష్టంగా తెలియజేస్తూ ఉంది. ముక్కులో ఉన్న గొట్టాలు, అతికించిన సెల్లోఫెన్ టేపులతో, ముఖాన్ని వికృతం చేస్తున్నాయ్

ట్రైనీ నర్సు గాభరా గాభరాగా నల్ల హౌస్ సర్జన్‌ను రోగి మంచం దగ్గరకు తీసుకుపోయింది. రోగి నాడి అందడం లేదు. కంటి పాపలు పైకి పోయి నిలిచిపోయినాయ్. డాక్టరు గాభరాగా "నర్సు" అని కేకవేసి తల తిప్పాడు. దర్వాజా దగ్గర వందల కొద్దీ నర్సులు! ఆ వార్డే నర్సుల్ని ప్రసవించినట్లు గుంపులు గుంపుగా శ్వేత వస్త్రాల తెళతెళలు! అందరికీ ముందుగా బిగించిన పెదాలతో. ఠీవిగా నిల్చుంది రెండో నర్సు.

"బయటికొచ్చేయండి సిస్టర్! మన ఎసోసియేషన్ మెరుపు సత్యాగ్రహానికి పిలుపిచ్చేసింది. మనమీద కుర్ర డాక్టర్ల జులుం ఎంత వరకూ సాగుతుందో చూద్దాం. సంజాయిషీ అడగడానికి కమిటీ వేస్తున్నారు. కాసేపట్లో డి. యం. ఓ. తో కలిసి చీఫ్ యిక్కడికి వస్తారట."

నల్ల హౌస్ సర్జన్ గాలి తీసేసిన బెలూన్‌లా అయిపోయాడు. అవతల పేషంటు ఒంటి నిండా నీళ్ళు గుమ్మరించినట్టు చెమట. స్టెత్‌ను అటూ ఇటూ కదుపుతూ సరిగా వినపడని గుండె మోతను వినాలని ప్రయత్నం చేస్తున్నాడే తప్ప, ఇంకేం చెయ్యలేక పోతున్నాడు. గుండె మసాజ్ చెయ్యాలనీ, ఇంజెక్షన్ ఇవ్వాలనీ, ఆక్సిజన్ అందజెయ్యాలనీ తెలీకకాదు-బుర్ర పని చేసే స్థితిలో లేక, తను పిలిచినా నర్సు రాదు. తనొక్కడూ ఒంటరిగా యముడితో పోట్లాడగలడా! - ఇంకాసేటో ప్రత్యక్ష యముడికి సంజాయిషీ యిచ్చుకోవాలి. తలుచుకున్న కొద్దీ గాభరా ఎక్కువై ఒంటి నిండా తనక్కూడా చెమటలు దిగజారడం మొదలు పెట్టింది.

హెడ్ నర్స్ అనుభవంతో పండిన ఉద్యోగి. ఒక్క నిముషం వృధా అయితే ఒక మనిషి ప్రాణం పోతుందని తెలుసు. నర్సుల గుంపువైపు చెయ్యెత్తి ఆగమన్నట్టు సౌంజ్ఞ చేసింది. "అవతలి పేషెంటు చావు బతుకుల్లో ఉన్నాడు. మన మానావమానాల కంటే మన చేతుల్లో పడ్డ రోగుల ప్రాణాలు మనకు ముఖ్యం. ఈ కేసు అనుభవంలేని కుర్రడాక్టరుకు వదిలేసి బయటికి రాను. కొంచెం ఆగండి!——" అంటూ పెదవి విప్పకుండా కళ్ళతోనే మాటాడి చకచక రోగి మంచం దగ్గరికి వచ్చేసింది.

"ధైర్యం తెచ్చుకోండి డాక్టర్! కొంచెం సేపు జరిగింది మర్చిపోదాం. కార్డియాక్ మాసేజి మొదలు పెటండి. ట్రెకియాలోకి ట్యూబ్ వేసి ఆక్సిజనిద్దాం. ఎడ్రినలిన్ ఇంజక్షన్ కూడా సిద్ధం చేశాను. నన్నివ్వమంటారా! మీరిచ్చేయగలరా!" - అంటూ మెత్తగా బుజగిస్తున్నట్టుగా చెప్పింది. డాక్టరు గంగిగోవులాగా ఆవిడ చెప్పినవన్నీ చెయ్యడం మొదలుపెట్టాడు. క్షణ క్షణం సహాయం అందించడంలో ఆరితేరిన ఆ పేషెంట్ చకచకా కదులుతుంటే ఎంతో ఆత్మ విశ్వాసం తనలోకి సరఫరా అవుతున్నట్లనిపించింది.

పేషెంటు తిప్పుకున్నాడు. "గుడ్‌బై డాక్టర్! అండ్ గుడ్ లక్" అంటూ అంత వరకూ ద్వారం దగ్గరే నిశ్శబ్దంగా నిలబడి ఉన్న గుంపుతో కలిసి బయటికి వెళ్ళిపోయింది హెడ్ నర్స్!

మర్నాడు తాటికాయలంత అక్షరాలతో "హౌస్ సర్జన్ల అధికార దుర్వినియోగం - నర్సుల మెరుపు సత్యాగ్రహం" అనే వార్త పత్రికలలో వచ్చింది. ✱

జ్యోతి